
నిమజ్జన వేడుకల్లో ఆడిపాడుతున్న మంత్రి దయాకర్‌రావు

## 'ప్రతి ఒక్కరికీ భక్తిభావం ఎంతో అవసరం'

పెద్దవంగర, సెప్టెంబర్ 30 : ప్రతి ఒక్కరిలో భక్తిభావం ఎంతో అవసరమని, భక్తితో ఎంతో మానసిక ప్రశాంతత ఉంటుందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. శుక్రవారం రాత్రి మండల కేంద్రంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, నిమజ్జన వేడుకల్లో పాల్గొని నిర్వాహకులతో కలిసి డీజే పాటలకు కోలాట నృత్యం చేశారు. కార్యక్రమంలో మండల యాదవ సంఘ నాయకులు నిమ్మల శ్రీనివాస్, వినాయ ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు అనుదీప్, గౌరీ, మహేశ్, మహిళలు పాల్గొన్నారు.


ఆలయ హుండీ లెక్కింపు చేస్తున్న సిబ్బంది

## వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు..

నర్సింహులపేట, సెప్టెంబర్ 30 : మండల కేంద్రంలోని ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు మహబూబాబాద్ జిల్లా దేవాదాయ ధర్మాదాయశాఖ పరిశీలకురాలు నందనం కవిత పర్యవేక్షణలో శనివారం జరిగినది. ఈ లెక్కింపులో రూ.78,901 ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ బొల్లం రమేశ్‌బాబు, ధర్మకర్తలు కుదుమూరి వెంకటేశ్వర్లు, తాడబోయిన వెంకన్న, భూక్యా వీరు, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సేవా సమితి ట్రస్ట్ సభ్యులు కే వేణుగోపాల్, అర్చకులు శ్రీనందనాచార్యులు, ఆరుట్ల రామాచార్యులు, జూనియర్ అసిస్టెంట్ మార్క శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు గ్లాసులు పంపిణీ

దంతాలపల్లి, సెప్టెంబర్ 30 : మండలంలోని దాట్ల గ్రామంలో జడ్పీహెచ్ఎస్ పాఠశాలలోని 180మంది విద్యార్థులకు పాఠశాలలో పనిచేస్తున్న మ్యాథ్స్ ఉపాధ్యాయురాలు షహనాజ్‌బేగం తన భర్త జానీమియా జ్ఞాపకార్థం రాగి జావ తాగేందుకు గ్లాసులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంజయ్, స్వప్న, రమేశ్, మంజుశ్రీ, ప్రేమ్‌కుమార్, రిషిత పాల్గొన్నారు.

## రేపు మెగా రక్తదాన శిబిరం

తొర్రూరు, సెప్టెంబర్ 30 : అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకొని తొర్రూరులో నిర్వహించే మెగా రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలని జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజ్‌మెంట్ సభ్యులు డాక్టర్ కుందూరు రాజేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయటం వల్ల ఆరోగ్యంగా ప్రయోజనం కలుగడంతోపాటు అవసరార్థులకు సాయం చేసిన వారిమి అవుతామన్నారు. యువజన సంఘాలు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, వర్తక సంఘ సభ్యులు, అన్ని కుల సంఘాల సభ్యులు చాంబర్ ఆఫ్ కామర్స్ తొర్రూరు సభ్యులు పాల్గొని రక్తదానం చేసి, జాతిపిత మహాత్మా గాంధీకి ఘన నివాళులు అర్పిద్దామన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మహబూబాబాద్ డీసీ మెంబర్ తమ్మెర విశ్వేశ్వరరావు, కమిటీ సభ్యులు రేగురి వెంకన్న, డాక్టర్ పాలడుగు కిరణ్‌కుమార్, తుమ్మేటి వెంకట రెడ్డి, లైయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్స్ జి విజయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## అంతిమ సంస్కారాలకు ఆర్థిక సాయం

కురవి, సెప్టెంబర్ 30 : బలపాల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకురాలు రాయల నాగమ్మ(80)అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. గ్రామానికి చెందిన రాయల బుచ్చయ్య, నాగమ్మ(80) దంపతులకు పిల్లలు లేరు. నాగమ్మ అనారోగ్యంతో శనివారం మృతిచెందిన విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు నామ సైదులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు సొంతంగా రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. బత్తుల వెంకన్న, మదన్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

# తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం

- సబ్బండ వర్గాల సంక్షేమమే సర్కారు ధ్యేయం
- ప్రతి గడపకూ ప్రభుత్వ పథకాలు అందజేత
- నియోజకవర్గంలో రూ.200కోట్లతో అభివృద్ధి పనులు
- ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు అండగా నిలవాలి
- డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్
- రూ.26కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన


దంతాలపల్లి లబ్ధిదారులకు గృహలక్ష్మి పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

దంతాలపల్లి, సెప్టెంబర్ 30: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. శనివారం మండలంలోని దాట్ల గ్రామం –రాంపూరం వరకు రూ.3కోట్లతో బీటీ రోడ్డు, బీరిశెట్టిగూడెం –రేపోణి వరకు ఎస్సారెస్పీ కాల్వపై రూ. కోటితో బ్రిడ్జి నిర్మాణం, దంతాలపల్లిలో రూ. కోటితో తారు, సీసీ రోడ్ల నిర్మాణం, దంతాలపల్లి –పెద్దముప్పారం వరకు రూ.14కోట్ల వ్యయంతో డబుల్ రోడ్డు, పాలేరు వాగుపై రూ.8కోట్లతో బ్రిడ్జి నిర్మాణం, సీసీ రోడ్లు, దొనకొండలో రూ.20లక్షలతో కొత్త గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, అన్నివర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. రెండు నెలల్లోనే నియోజకవర్గంలో రూ. 200కోట్ల నిధులు తీసుకొచ్చి పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రజల సౌకర్యార్థం రవాణా బాగుంటేనే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని భావించి అన్ని గ్రామాలకు తారు, సీసీ రోడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రానికి దేశంలోనే ప్రత్యేక గుర్తింపు వచ్చిందని, సంక్షేమంలో నంబర్ వన్ స్థానానికి చేరుకుంటుందన్నారు. వర్గాలకు తావులేకుండా ఐక్యతతో పనిచేసి వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రి చేయాలన్నారు. ఎన్నికల్లో కారుకు తిరుగులేదని, కేసీఆర్ హ్యాట్రిక్ విజయం ఖాయమనారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ పథకాలతో రాష్ట్రం పచ్చగా కళకళలాడుతోందన్నారు. సబ్బండ వర్గాల సంక్షేమమే బీఆర్‌ఎస్ లక్ష్యమనారు. మూడు గంటల కరెంట్ ఇచ్చే కాంగ్రెస్ కావాలా.. మూడు పంటలకు నిరంతరం నీరు, విద్యుత్ అందించే బీఆర్‌ఎస్ కావాలో ప్రజలే తేల్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా సుమారు రూ.26కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. దాట్ల గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్యేను సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం మద్దిరాల మండలం కొత్తపల్లికి చెందిన సర్పంచ్ వెంకన్న, కాంగ్రెస్, బీజేపీ నాయకులు కలిశారు. తమ గ్రామాని డోర్నకల్ నియోజకవర్గంలో చేర్చుకోవాలని వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసే వస్తున్నట్లు వారు తెలిపారు.

### బీఆర్‌ఎస్‌లో చేరికలు

మండలంలోని దాట్ల, దంతాలపల్లి గ్రామాల్లో వివిధ పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే రెడ్యానాయక్ అధ్వర్యంలో కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. దాట్లలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు శివకుమార్, దంతాలపల్లిలో సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ పార్టీల నుంచి పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు.

### లబ్ధిదారులకు గృహలక్ష్మి పత్రాలు అందజేత..

రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు ఇంటి నిర్మాణం కోసం గృహలక్ష్మి పథకం ద్వారా అందిస్తున్న రూ.3లక్షల ఆర్థిక సాయంలో భాగంగా 17 గ్రామాలకు చెందిన 400 మందికి గృహలక్ష్మి పత్రాలను ఎమ్మెల్యే రెడ్యానాయక్ అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ నూకల వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ వొల్డాద్రి ఉమ, పీఏసీఎస్ చైర్మన్ సంపెట రాము, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ వొల్డాద్రి మల్లారెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు నూకల గౌతమ్‌రెడ్డి, నాయిని శ్రీనివాస్‌రెడ్డి, కొమ్మినేని రవీందర్, పార్టీ మండల అధ్యక్షుడు ధర్మారాపు వేణు, తొర్రూరు మార్కెట్ డైరెక్టర్ కిశోర్‌కుమార్, మండల మహిళా అధ్యక్షురాలు గిరాణి, సర్పంచులు నెహ్రూనాయక్, సుస్మిత, హిమబిందు, ఉప్పలయ్య, నరేశ్, కృష్ణ, ఎంపీటీసీలు రమణారెడ్డి, పద్మ, నాయకులు మధుకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సోమేశ్వర్, రామకృష్ణ, ఎంపీడీవో భారతి, మహిళలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రోడ్డును శుభ్రం చేస్తున్న కార్పొరేటర్, ఆర్పీలు, నాయకులు

## పరిసరాల శుభ్రత, ఆరోగ్యంపై అవగాహన

పోచమ్మమైదాన్, సెప్టెంబర్ 30: వరంగల్ మట్టెవాడ ప్రభుత్వ పాఠశాలలో శనివారం స్వచ్ఛతా కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ ఆకుతోట తేజస్వి–శిరీష్ ఆర్పీలు, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పాఠశాల ఆవరణను శుభ్రం చేశారు. అలాగే, పాపయ్యపేట చమన్‌లోని వివేకానంద విగ్రహం వద్ద విద్యార్థులకు పరిసరాల శుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. అనంతరం కార్పొరేటర్ మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పందికొండ శివరాజ్, బీఆర్‌ఎస్ మైనార్టీ విభాగం డివిజన్ అధ్యక్షుడు సద్దాం, నాయకులు దాచెపల్లి సీతారం, చాగంటి కిరణ్, ఎస్‌కే రబ్బాని, ఇర్ఫాన్, ఇనాయత్, అశ్వక్, ఆర్పీలు పుష్ప, ఉమ, రజియా, ఆశ వర్కర్లు సంధ్య, గౌసియా, నాజియా, రమాదేవి, మల్లీశ్వరి, విజయ పాల్గొన్నారు.

## 'విద్యార్థులు సమాజ సేవలో ముందుండాలి'

గిర్మాజీపేట, సెప్టెంబర్ 30: విద్యార్థులు చదువుతోపాటు సమాజ సేవలో ముందుండాలని శ్రీవిశ్వేశ్వర సంస్కృతాంధ్ర కళాశాల అధ్యక్షుడు హరీశ్‌కుమార్ అన్నారు. కళాశాల వ్యవస్థాపకుడు ఆకారపు నర్సింగం గుప్తా 72వ వర్ధంతి సందర్భంగా శనివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాశాల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హరీశ్‌కుమార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సోనబోయిన సతీశ్, పాలకవర్గ సభ్యులు మల్యాల వీరమల్లయ్య, అధ్యాపకులు పీ రంగాచార్యులు, లింగయ్య, కుమారస్వామి, జయకృష్ణ, శెట్టి దేవరాజు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌కుమార్

## 'నిధుల సమాచారం ఇవ్వడం లేదు'

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 30 : గ్రామ పంచాయతీ అభివృద్ధికి మంజూరైన నిధుల సమాచారం ఇవ్వకుండా మండల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మాధవాపురం ఉపసర్పంచ్ బొమ్మకంటి వీరన్న శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. సంవత్సర కాలంగా జీపీలో గ్రామ సభలలో తీర్మానాలు లేకుండా నోటి ఫైల్స్ మీద సంతకాలు లేకుండానే సెక్రటరీ జీపీ నిధులను డ్రా చేస్తున్నారని తెలిపారు. నిధుల సమాచారంపై ఎంపీడీవో, ఎంపీవోకు అనేక సార్లు దరఖాస్తు చేసినా ఫలితం లేదన్నారు. ఉన్నత అధికారులు స్పందించాలని కోరారు.

## నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నర్సింహులపేట, సెప్టెంబర్ 30 : మండల కేంద్రంతోపాటు కొమ్ములవంచ, రూప్లాతండా గ్రామపంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు ఆదివారం డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ శంకుస్థాపన చేస్తారని బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మైదం దేవేందర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కొమ్ములవంచ నుంచి నర్సింహులపేటకు వెళ్లేందుకు కల్వర్టు నిర్మాణం, రూప్లాతండా గ్రామ పంచాయతీ పరిధిలోని హున్య తండా రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం జరుగుతుందని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

## ఘనంగా నిమజ్జనోత్సవ వేడుకలు

డోర్నకల్, సెప్టెంబర్ 30 : డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని యాదవ్‌నగర్ జెండా సెంటర్‌లో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడి నిమజ్జన వేడుకలు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలతో నృత్యాలు చేస్తూ, పట్టణ పుర వీధుల్లో ఊరేగింపుగా వెళ్లి బతుకమ్మ చెరువులో నిమజ్జనం చేశారు. నిమజ్జన వేడుకల్లో ప్రజా ప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 'సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలి'

నల్లబెల్లి, సెప్టెంబర్ 30: సీజనల్ వ్యాధులపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని పల్లె దవాఖాన వైద్యాధికారి శ్రుతి సూచించారు. లెంకాలపల్లిలో నల్లబెల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం డాక్టర్ శ్రుతి మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వి ఉండడం వల్ల దోమలు వృద్ధి చెందుతాయన్నారు. దీంతో మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవడంతోపాటు దోమతెరలు వాడాలని, కిటికీలు, తలుపులు, వెంటిలేటర్లకు జాలీలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు.